

'ఇందిరమ్మ ఇండ్లు' ఎంతో దూరం?

ఇండ్ల పథకంపై సిద్ధంకాని మార్గదర్శకాలు ● కొత్తగా మళ్లీ దరఖాస్తులు పిలిచే అవకాశం ● లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు

ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర తప్పనిసరి ● జూన్ 4 తర్వాతే కసరత్తు అన్న అధికారులు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు హడావుడిగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఇప్పటికీ మార్గదర్శకాలను రూపొందించలేదు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు ఇస్తామని చెప్పినా.. పట్టణ ప్రాంతాలకు ఎన్ని, గ్రామాల కోటా ఎంత? అర్హులు, అనర్హులు, రిజర్వేషన్లు తదితర అంశాలపై ఎటువంటి స్పష్టత లేదు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాతే మార్గదర్శకాలపై కసరత్తు ప్రారంభమవుతుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. మరోవైపు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని గతంలో మాదిరిగా రాజకీయ అవసరాల కోసమే వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను పూర్తిగా ఎమ్మెల్యేల చేతుల్లో పెట్టాలని భావిస్తున్నట్టు సమాచారం. పైగా ఆ జాబితాకు ఇన్‌చార్జి మంత్రి ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుందని నిబంధన పెట్టనున్నట్టు చర్చ జరుగుతున్నది. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు అదనంగా మళ్లీ దరఖాస్తులను పిలిచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

లక్ష్యం దెబ్బతినకుండా ఎంపిక సాధ్యమేనా?

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇల్లులేని పేదలకు ఇల్లు కట్టిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల గ్యారెంటీలో ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున మొత్తం రాష్ట్రంలో 4.5లక్షల ఇండ్లు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత మార్చి 11న ప్రభుత్వం భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ.. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ఈ పథకాన్ని పక్కకుపెట్టింది. ఎన్నికల కోడ్ పూర్తయ్యాక మార్గదర్శకాలు రూపొందించనున్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం ఇదివరకే విడుదల చేసిన నిబంధనల ప్రకారం సొంత జాగా ఉండి, గతంలో ఎప్పుడూ ప్రభుత్వం నుంచి ఇల్లు పొందనివారు, తెలుపు రేషన్ కార్డు కలిగివున్నవారితో జాబితాను రూపొందించి గ్రామసభల్లో అర్హులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే, పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్నవారిలో చాలామందికి ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలు లేవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు తదితరులకు ఎంతమేరకు భాగస్వామ్యం కల్పించాలనేది కూడా ఇంకా నిర్ణయించాల్సివుంది. ఇప్పుడు ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగిస్తే అసలు లక్ష్యం దెబ్బతింటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అనుచరులు, సన్నిహితులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఇలా సొంత వారికే కైంకర్యం చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఇలాగే జరిగే అవకాశం ఉన్నదని హెచ్చరిస్తున్నారు.

నిధుల సమీకరణ ఎలా?

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఒక్కో ఇంటికి దశలవారీగా రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ఇంటి కోసం ప్రజాపాలన సందర్భంగా 82,82,332 మంది దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా ఇందులో అనర్హులను తొలగించి అర్హులతో జాబితా తయారుచేసిన తరువాత ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేపట్టాల్సి ఉంటుంది. మరోవైపు, 4.5 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసేందుకు రూ. 22,500 కోట్లు అవసరమవుతాయి. కానీ బడ్జెట్‌లో రూ. 7,740 కోట్లు మాత్రమే కేటాయించారు. గృహనిర్మాణ శాఖ హడ్కోనుంచి రూ. మూడు వేల కోట్లు సేకరిస్తున్నది. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి రూ. 1.5 లక్షల చొప్పున నిధులు అందే అవకాశముంది. అయినప్పటికీ మరో రూ. 5000 కోట్ల వరకూ లోటు ఏర్పడనుంది.

పట్టణ పేదలకు ఇన్ సిటూ విధానంలో ఇండ్లు

గ్రేటర్ హైదరాబాద్ సహా వివిధ నగరాలు, పట్టణాల్లో మురికివాడల్లో నివసించే పేదలకు వారు ఉన్నచోటే (ఇన్ సిటూ విధానం) గుడిసెలను తొలగించి అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వాలని, అలాగే, పూరి గుడిసెలు కూడా లేకుండా అద్దె ఇండ్లలో ఉండే పేదలకు ప్రభుత్వ ఖాళీ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి హౌసింగ్ స్కీమ్‌లకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేస్తున్నది. అయితే, పట్టణాల్లో ఇంటి స్థలం ఉన్నవారికి మాత్రం యాజమాన్య పత్రాలు సరిగా ఉంటే వారికి ఇల్లు మంజూరు చేసే యోచన ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ పథకం ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంటే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మాత్రం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ముఖ్యనేతలు మాట్లాడుతూ తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాదీ దుర్మరణం

హైదరాబాద్, మే 17: అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన అబ్బరాజు పృథ్వీరాజ్(30) మరణించారు. నార్త్ చార్లెట్ ప్రాంతంలో తన భార్య, స్నేహితులతో కలిసి గురువారం రాత్రి పృథ్వీ ప్రయాణిస్తున్న కారు మరో కారును ఢీకొట్టింది. ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రమాదం నుంచి అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అయితే, పృథ్వీరాజ్ కారు దిగి పోలీసులకు ఫోన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా మరో వాహనం ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. సంగారెడ్డికి చెందిన విశ్రాంత విద్యుత్ శాఖ ఉద్యోగి అబ్బరాజు వెంకటరామణ్ కుమారుడు పృథ్వీరాజ్. వీరి కుటుంబం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో స్థిరపడింది. ఎనిమిదేండ్లుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్న పృథ్వీరాజ్‌కి గత ఏడాది వివాహం జరిగింది.

భూమ్ కాదు; రియల్టీ ఢామ్

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయాలు తీసుకుంటే క్రయవిక్రయాలపై పెద్దగా ప్రభావం ఉండదని చెప్తున్నారు. ఉదాహరణకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2021 వరకు కేసీఆర్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచలేదు. టీఎస్‌ఐపాస్ లాంటి పథకాల ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, టీహబ్ లాంటి వినూత్న ప్రయత్నాలు, సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లను నిర్మించడం, చెరువులను నింపడం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం, కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటు తదితర చర్యల ద్వారా రాష్ట్రంలో భూముల ధరలు విపరీతంగా పెరిగేలా చేసింది. స్వరాష్ట్రం ఏర్పడేనాటికి రూ.లక్షలు కూడా పలకని భూముల విలువ ఏకంగా రూ.కోట్లకు చేరింది. పట్టణీకరణ, అపార్ట్‌మెంట్ సంస్కృతి పెరిగింది. హైదరాబాద్ నగరం ఔటర్ రింగ్ రోడ్‌ను కూడా దాటి విస్తరించింది. ఆ తర్వాతే 2021 జూలైలో మొదటిసారి భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఫీజును సవరించింది. అప్పటివరకు మార్కెట్ విలువపై 6 శాతంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజును 7.5 శాతానికి పెంచింది. భూముల విలువను సైతం వ్యవసాయ భూమికి ఎకరాకు చొప్పున, ఖాళీ ప్లాట్లకు చదరపు గజం చొప్పున, ఇండ్లు, అపార్ట్‌మెంట్ ప్లాట్లకు చదరపు అడుగు చొప్పున కనీస ధర నిర్ణయించడంతోపాటు మార్కెట్ విలువను పెంచింది. మార్కెట్‌లో పెరిగిన ధరలతో పోల్చినప్పుడు ప్రభుత్వ ధరల పెంపు ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరిలోనూ మరోసారి భూముల విలువను సవరించింది. అయినా క్రయవిక్రయాలపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. కానీ, ప్రస్తుత పరిస్థితులు వేరు. నిరుడు సెప్టెంబర్ నుంచి వరుసగా ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం స్థిరంగా ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు నెలకొనడం, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడంతో ప్రస్తుతం మార్కెట్ ఆశాజనకంగా లేదు. ఫార్మాసిటీ రద్దు, జిల్లాల సంఖ్య కుదింపు వంటి ప్రభుత్వ నిర్ణయాలు, సాగునీరు లేక పంటలు ఎండిపోవడం, కరువు వంటి పరిస్థితులతో క్రయవిక్రయాలు తగ్గిపోతున్నాయి. నిరుడు నవంబర్ నుంచి మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగుతున్నది. గత రెండున్నర నెలల నుంచి మార్కెట్ తిరోగమనంలో సాగుతున్నది. గత 45 రోజుల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య దాదాపు 27%, ఆదాయం 12% పడిపోయింది. ఇలాంటి సమయంలో భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఫీజును పెంచడం సరికాదని రియల్ ఎస్టేట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

మార్చి నుంచి తిరోగమనం ఇలా..

నెల	రిజిస్ట్రేషన్ల సంఖ్య(లక్షల్లో)		వ్యత్యాసం	ఆదాయం (రూ.కోట్లలో)		వ్యత్యాసం
	2023	2024		2023	2024	
మార్చి	1.74	1.51	-15.23%	1,389	1,317	-5.46%
ఏప్రిల్	1.55	1.22	- 21.29%	1,087	1,125	2.55%
మే 16 వరకు	0.80	0.48	-40%	716	483	-32.54%

పెంపు ప్రక్రియ ఇలా..

రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు భూముల విలువను, స్టాంప్ డ్యూటీని సవరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపుపై కార్యాచరణ అమలు చేయనున్నట్టు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ముందుగా సర్వే నంబర్ల వారీగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు ఏ విధంగా ఉన్నాయి, ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువ ఎంత ఉన్నదో వివరాలను సేకరించనున్నారు. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలకు ఈ విధానాన్ని వర్తింపజేస్తారు. నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించి ప్రస్తుత ధరలను, బహిరంగ మార్కెట్ విలువను అధ్యయనం చేయనున్నారు. చివరగా భూముల విలువను ఎంత మేర పెంచవచ్చన్న దానిపై జిల్లాలవారీగా ప్రతిపాదనలు స్వీకరించి ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువలో స్టాంపు డ్యూటీ 5.5 శాతంగా ఉన్నది. దీనికి 0.5% ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, 1.5% రిజిస్ట్రేషన్ చార్జీలు కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు మార్కెట్ విలువలో 7.5 శాతంగా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.18,500 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా రూ.14,295 కోట్లు (77 శాతం) మాత్రమే వచ్చింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచేందుకు చార్జీలను పెంచాలని ఆదేశించారు.

ప్రియురాలి మృతిని తట్టుకోలేక బలవన్మరణం

- పవిత్రతో ఆరేండ్లుగా సహజీవనం
- ఇటీవలే యాక్సిడెంట్‌లో పవిత్ర మృతి

పవిత్ర, చందు. (ఫైల్)

మణికొండ, మే17: బుల్లితెర నటుడు చందు (చంద్రకాంత్) ఆత్మహత్యకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి ఠాణా పరిధిలోని అల్కాపూర్ కాలనీలో శుక్రవారం ఆయన తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. చందు త్రినయని, రాధమ్మ పెళ్లి, కార్తీకదీపం వంటి సీరియల్స్‌లో నటించారు. చందు 2015లో శిల్పా అనే యువతిని ప్రేమ వివాహం చేసుకోగా వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మరో టీవీ సీరియల్ నటి పవిత్ర జయరాంతో చందూ ఆరేండ్లుగా సహజీవనం చేస్తున్నట్టు చెప్తున్నారు. కర్ణాటకకు చెందిన వీరిద్దరూ త్వరలోనే వివాహం చేసుకోవాలని అనుకున్నారు. గత వారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో పవిత్ర మృతి చెందింది. ఆమె తోపాటు ఉన్న చందూ గాయాలతో బయటపడ్డాడు. రెండు రోజుల క్రితం పవిత్ర పుట్టిన రోజు సందర్భంగా 'ఆమె నన్ను పిలుస్తున్నది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఇంతలోనే బలవన్మరణానికి పాల్పడ్డారు.

● ఆనంద్ సినీ సర్వీసెస్‌కు భూకేటాయింపు చట్టబద్ధమే

మాజీ మంత్రి హరీశ్ పిల్‌ను కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని షేక్‌పేట సర్వే నంబర్ 403లో ఆనంద్ సినీ సర్వీసెస్ సంస్థకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించడాన్ని హైకోర్టు సమర్థించింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా ఈ కేటాయింపు జరిపిందని, ఇందులో చట్టవిరుద్ధమేమీ లేదని స్పష్టం చేసింది. ఈ భూకేటాయింపును వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు 2008లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం ఇటీవల కొట్టివేసింది.

● అమెరికాలో ఫీజులో డిస్కౌంట్ పేరుతో మోసాలు

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): అమెరికాలో చదువుతున్న విద్యార్థులకు విశ్వవిద్యాలయాలకు ఫీజులను తమ ద్వారా చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇస్తానంటూ నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఏపీకి చెందిన యువకుడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కనోళ్ల అశోక్‌కుమార్, ఢిల్లీకి చెందిన తరుణ్, అమెరికాలో ఉంటున్న తరుణ్ స్నేహితులు. ఈ ముగ్గురు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలో పనిచేశారు. ఆ సమయంలో ఎవరెవరు అమెరికాకు స్టూడెంట్ వీసాపై వెళ్లారనే సమాచారం సేకరించారు. అమెరికాలో చదువుతున్న విద్యార్థులకు ఫోన్ చేసి తమ ద్వారా యూనివర్సిటీకి సెమిస్టర్ ఫీజు చెల్లిస్తే 10 శాతం డిస్కౌంట్ ఇస్తామంటూ నమ్మించారు. కొందరు విద్యార్థులు వీళ్ల మాటలు నమ్మి బ్యాంకులలో డబ్బు డిపాజిట్ చేశారు. నిందితులు క్రెడిట్, డెబిట్ కార్డులతో యూనివర్సిటీకి మొత్తం ఫీజు చెల్లించేవారు. ఫీజు చెల్లించగానే విద్యార్థులు కూడా అక్కడ చెక్ చేస్తే ఫీజు పెయిడ్ అని రికార్డుల్లో ఉండేది. విద్యార్థులు ఈ విషయాన్ని నిర్ధారించుకోగానే, నిందితులు క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, తమ కార్డుపై ట్రాన్సాక్షన్ మోసపూరితంగా జరిగిందంటూ ఫిర్యాదు చేసేవాళ్లు. అప్పటికే యూనివర్సిటీకి చెల్లించిన సొత్తును సదరు క్రెడిట్ కార్డు సంస్థ వెనక్కి తీసుకునేది. దీంతో యూనివర్సిటీ నుంచి విద్యార్థులకు ఫీజు చెల్లించలేదనే నోటీసులు వచ్చేవి. విద్యార్థులు నిందితులకు ఫోన్ చేస్తే..మేం అప్పుడే చెల్లించామంటూ విషయాన్ని దాటవేసేవారు. ఈ విషయంపై సికింద్రాబాద్‌కు తిరుమలగిరికి చెందిన సుధాకర్ ఫిర్యాదు చేయడంతో నిందితుడు అశోక్ కుమార్‌ను అరెస్ట్ చేసి, మిగతా వారికోసం గాలిస్తున్నారు.

● గంటలో రూ.60 లక్షలు కాపాడారు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ) : 'హలో నేను ముంబై నుంచి పోలీస్ ఆఫీసర్. మీరు మనీలాండరింగ్ కేసులో ఇరుక్కున్నారు. మీపై వారెంట్ పెండింగ్‌లో ఉంది' అంటూ బుధవారం రాత్రి స్కైప్ వీడియో కాల్‌లో ఓ మహిళను బెదిరించాడో సైబర్ నేరగాడు. ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.లక్షల్లో కావాలని, లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించాడు. దీంతో ఆమె సైబర్ నేరగాడు చెప్పిన బ్యాంకు ఖాతాకు రూ.60లక్షలు పంపింది. చేయని తప్పునకు తానేందుకు డబ్బులు కట్టాలనే ఆలోచనతో నిమిషాల్లోనే అప్రమత్తమైన బాధితురాలు 1930కి కాల్ చేసింది. వెంటనే స్పందించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బంది లావాదేవీల వివరాలను సీఎఫ్‌సీఎఫ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, ఎస్‌బీఐని అప్రమత్తం చేశారు. దీంతో వారు నిమిషాల వ్యవధిలోనే ఆ నగదును బదిలీ కాకుండా నిలిపివేశారు. 'గోల్డెన్ అవర్'లోనే స్పందించడం వల్ల బాధిత మహిళ తన డబ్బును పూర్తిగా తిరిగిపొందేందుకు అవకాశం దొరికిందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ వెల్లడించారు. నగదు సైబర్ దొంగలకు వెళ్లకుండా కాపాడిన ఎస్ఐ శిరీష, కానిస్టేబుళ్లు రేహమాన్, కృష్ణను ఏడీజీ అభినందించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు నిమిషాల వ్యవధిలోనే 1930కి కాల్ చేయాలని, లేదా cybercrime.gov.in ఫిర్యాదు చేయాలని సూచించారు.

● ఎమ్మెల్యే టికెట్‌కు 50 లక్షలు: కేపీ పాల్‌పై కేసు

ఖైరతాబాద్, మే 17 : ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేపీ పాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పంజాగుట్ట డీఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా గుగ్గిళ్లగూడకు చెందిన కిరణ్ మీర్‌పేటలో ఎస్వీ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. నిరుడు జనవరిలో ఎల్బీనగర్ టికెట్ కోసం కేపీ పాల్‌ను కలువగా రూ.50లక్షలు ఇస్తే టికెట్ ఇస్తానని చెప్పాడు. దీంతో వ్యాపారి రూ.30లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. అనంతరం విడతలవారీగా రూ.20 లక్షలు ముట్టజెప్పాడు. గత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇస్తానంటూ తిప్పించుకొని చివరికి పాల్ చేయిచ్చాడు. బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, దాటవేస్తూ వచ్చాడు. దీంతో కిరణ్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, పాల్‌పై 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

● ఓటేయడంలో మగవారే ముందున్నారు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో పురుషులే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 66.07 శాతం ఓటు వేయగా, మహిళలు 65.29 శాతం ఓటు వేశారు. పురుషులు 1,65,13,014 ఉండగా 1,09,09,963 మంది, మహిళలు 1,67,00,574 ఓటర్లుగా ఉండగా 1,09,03,227 ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్లుగా మహిళలే అధికంగా ఉన్నా ఓట్లు మాత్రం తక్కువగా వేశారు. రాష్ట్రంలో మొత్తం 65.67 శాతం ఓటర్లు ఓటు వేశారు. ట్రాన్స్‌జెండర్లు 30.25 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. భువనగిరి, నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్, చేవెళ్ల, హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పురుషులు, మిగిలిన లోక్‌సభ నియోజకవర్గాల్లో మహిళలు ఎక్కువ మంది ఓటేశారు.

● 'తెలంగాణ రాష్ట్రం' సంక్షిప్త నామం ఇకపై 'టీజీ'

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని సూచించే అధికారిక సంక్షిప్త నామాన్ని ప్రభుత్వం 'టీజీ'గా మారుస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, అధికారిక హోదాలు సూచించే బోర్డుల్లో ఈ మార్పులు చేయాలని సూచించారు. జీవోలు, పాలసీ పేపర్లు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, లెటర్ హెడ్స్, అధికారిక పత్రాల్లో టీజీ వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే టీఎస్ పేరుతో ముద్రించిన పత్రాలను ఏం చేయాలనే దానిపై ఈ నెలాఖరుకు నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్, మే 17 : ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల వేధింపుల కారణంగా తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్టు అతడి భార్య ఆరోపించారు. స్థానికుల కథనం ప్రకారం.. తెలకపల్లికి చెందిన వెంకటయ్య (45)కు భార్య అలివేలుతోపాటు కూతురు ఉన్నది. ఈయన ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడ్రోజుల కిందట మండల కేంద్రంలో ఆటో ఎక్కిన ఓ మహిళ బంగారం పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విచారణ కోసమంటూ వెంకటయ్యను పోలీసులు స్థానిక స్టేషన్‌కు పిలిపించారు. బంగారం గురించి అడుగుతూ తీవ్రంగా కొట్టి విడిచిపెట్టారు. మళ్లా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో భార్యకు ఫోన్ చేసి తాను ఏ తప్పు చేయలేదని.. పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారని బాధపడ్డాడు. తర్వాత పట్టణ సమీపంలోని పెద్ద చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

'మేడిగడ్డ' పనులు ప్రారంభం

గేట్లు, ఇసుక తొలగింపు షురూ

హైదరాబాద్, మే17 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో మేడిగడ్డ బరాజ్ వద్ద చేపట్టాల్సిన రక్షణచర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ చేసిన మధ్యంతర సిఫారసులకు సంబంధించిన పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రారంభించింది. బరాజ్‌లోని బ్లాక్-7లో 8 గేట్లను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టింది. వరద ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలని, అందుకు గేట్లను పూర్తిగా తెరచి ఉంచాలని, ఆటంకంగా మారిన ఇసుకమేటలు, రాళ్లను తొలగించాలని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచించిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన పనులను చేట్టాలని బరాజ్ నిర్మాణ ఏజెన్సీకి ఇరిగేషన్ శాఖ ఇటీవలనే ఆదేశాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో సదరు ఏజెన్సీ మొత్తం 8 గేట్లలో ఇప్పటికే ఒక గేటును ఎత్తి పెట్టింది. మరో 2 మినహా మిగతా గేట్లను సైతం సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశముందని ఎల్‌అండ్‌టీ అధికారులు వెల్లడిస్తున్నారు. పగుళ్లు ఏర్పడిన 20వ పిల్లర్, దానిపక్కన ఉన్న పిల్లర్ గేట్లను ఎత్తడంలోనే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడుతున్నది. బరాజ్‌కు దిగువన, ఎగువన పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగిస్తున్నది. రాష్ట్ర కింద ఉన్న రంధ్రాలను ఇసుక, సిమెంట్‌తో గ్రౌటింగ్ చేసేందుకు, షీట్ పైల్స్‌ను వేసేందుకు సైతం సంసిద్ధమైంది.

మేడిగడ్డ బరాజ్ వద్ద కొనసాగుతున్న పనులు

'మేడిగడ్డ' పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు చేపట్టాల్సిన సత్వర పనులపై ఇరిగేషన్ శాఖ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఈఎన్సీ జనరల్, ఈఎన్సీ (ఓఅండ్ఎం), సీఈ (సీడీవో), రామగుండం సీఈతో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

న్యాయవిచారణ కమిషన్‌కు 3 ఫిర్యాదులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటయిన జ్యుడీషియరీ కమిషన్‌కు ఇప్పటివరకు 3 ఫిర్యాదులు మాత్రమే అందాయి. ప్రాజెక్టుపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు కమిషన్ ప్రత్యేకంగా బాక్సులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఫిర్యాదులు చేసేవారెవరైనా సరే సాక్ష్యాలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. దీంతో ఫిర్యాదులు ఎక్కువగా రాలేదని తెలిసింది. కాగా కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ జూన్ 6న రాష్ట్రానికి రానున్నారని సమాచారం.

గడువులోగా ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తిచేయాలి : రాహుల్ బొజ్జా

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రత